క్లుప్తంగా

దూర విద్య కోర్సులకు ఆహ్వానం

గురజాల: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేసేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆశాలత తెలిపారు. ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9398710992 నెంబరులో సంప్రదించాలన్నారు.

పోలేరమ్మా.. కరుణించమ్మా



కారెంపూడి : మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ఆదివారం జరిగిన పోలేరమ్మ తల్లి తిరునాళ్లలో మహిళలు బోనాలు సమర్పించారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు సింగరుట్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ జరిగిన ప్రత్యేక హోమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుండాల శ్రీనివాసరావు, కొత్రపాటి సీతారామ ప్రసాద్, టీడీపీ నాయకులు చప్పిడి రాము, మాజీ సర్పంచ్ నర్సింగ నాగేశ్వరరావు, గాడిపర్తి పూర్ణయ్య, చావా వీరాంజనేయులు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

పెదకూరపాడు: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలు పాలైన జనసేన కార్యకర్త తోట వీరయ్యను పల్నాడు జిల్లా జనసేన నాయకులు నూదా సాంబశివరావు పరామర్శించారు. ఈ సందర్భంగా వీరయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరుపున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు.

రాయితీపై వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం

నకరికల్లు: జేజీఎల్ 384 వరిరకానికి ప్రత్యామ్నయంగా సాగు చేయదగిన వరి విత్తనాలను రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం తెలిపారు. కేఎస్‌ఎం 1638 రకం, ఎంటీయూ 1224 రకం విత్తనాలకు ఒక్కోకిలోకి రూ.5లు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జేజీఎల్‌కు ప్రత్యామ్నయమైన కేఎస్‌ఎం 1638 రకం 107 క్వింటాళ్ల విత్తనాలు, ఎంటీయూ 1224 రకం 26 క్వింటాళ్లు ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాలు మొక్కకట్టే ముందుగా ఒక కేజీ విత్తనానికి 10గ్రాముల సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ , కార్బండిజం ఒకగ్రాము చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు.

ఎస్‌ఐ బదిలీలో వెల్లివిరిసిన తెలుగు సంప్రదాయ శోభ



నాదెండ్ల: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సంప్రదాయాల్ని గౌరవించాలని బదిలీ అయిన ఎస్‌ఐ జె. బలరామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గతేడాది జులై 19న మండల ఎస్‌ఐగా విధుల్లో చేరిన ఆయన, ఇటీవల పల్నాడు జిల్లా సీసీఎస్‌కే బదిలీ అయ్యారు. రిలీవ్ సందర్భంగా తెలుగు సంప్రదాయం ప్రకారం తెల్లపంచె, షర్టు, కండువా ధరించి స్టేషన్‌కు హాజరయ్యారు. ఏఎస్‌ఐలు రమేష్, కొండలు, మల్లేశ్వరరావు, రోశిబాబు, రవిచంద్ర, గౌస్, కానిస్టేబుళ్లు, సిబ్బంది సైతం సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. దీంతో స్టేషన్‌లో తెలుగు సంప్రదాయ శోభ వెల్లివిరిసింది. బదిలీపై వెళ్తున్న ఆయన్ను శాలువాలతో సత్కరించారు.

నిత్యావసరాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు జి.వి. మాధవరావు ఆధ్వర్యంలో కొత్తపేటలోని వారి కార్యాలయంలో పేద బ్రాహ్మణులకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలం సహాయం అందించిన దాతలు చింతలపూడి సుబ్బారావు, అక్కిరాజు శశికళకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థిని తులసి సభ్యులకు బీపీ పరీక్షలు చేసింది.

రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శిగా కిరణ్

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శిగా పట్టణానికి చెందిన మండవ వెంకట కిరణ్‌కుమార్ నియమితులైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఆర్యవైశ్య, వాసవీ సంస్థల్లో చురుకుగా పాల్గొంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌కు ఈ పదవి రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

● కాల్వలు ఇలా.. నీరు పారేదేలా?



పల్నాడు ప్రాంతంలోని రైతులు అధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు. ఈ ఏడాది వర్షాలు కురిసి, పైనుంచి నీరు పుష్కలంగా రావడంతో జలశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. అయితే నియోజకవర్గంలోని కాలువల పరిస్థితి అధ్వానంగా తయారైంది. జలాశయాల్లో ఎంత నీరున్నా పొలాల్లోకి నీరు వచ్చే కాల్వలు చెత్తాచెదారం, తూటి కాడతో నిండి ఉండడంతో రైతులు నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ఎన్‌ఎస్‌పీ అధికారులు స్పందించి కాలువలకు మరమ్మతులు చేసి నీరు పారే విదంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. – గురజాల

● గంగమ్మ తల్లికి బోనాలు



బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



పట్టణంలోని గంగమ్మతల్లి దేవాలయంలో ఆదివారం శ్రావణ మాసం మొదటి ఆదివారం సందర్భంగా గంగమ్మ తల్లికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనార్థం గంగమ్మతల్లికి నెమలి పింఛాలతో విశేష అలంకరణ ఏర్పాటు చేశారు. మహిళలు భారీసంఖ్యలో హాజరై బోనాలను సమర్పించారు. సాయంత్రం గంగమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని ఐలాండ్ సెంటర్ మీదుగా జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. –పిడుగురాళ్ల

రూరల్ సీఐ నసీబ్ బాషా బాధ్యతల స్వీకారం



మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా షేక్ నసీబ్ బాషా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నసీబ్ బాషా ప్రకాశం జిల్లా గిద్దలూరులో సీఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీఐ సురేష్ గిద్దలూరు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఏర్పడేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను తీసుకొస్తామని, అలాగే గ్రూపులు, ముఠా కక్షలు పెంపొందిస్తే వారు ఎంత వారైనా చర్యలు తప్పవని, మట్కా, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తానని చెప్పారు. ప్రజలతో నేరుగా సంబంధాలు పెంచుకొని శాంతిభద్రతల పరిరక్షణలో ప్రత్యేక చొరవ చూపుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎస్‌ఐలు ఆయనకు అభినందనలు తెలిపారు.

పిడుగురాళ్ల ఎస్‌ఐ మోహన్ బాధ్యతల స్వీకారం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ ఎస్‌ఐగా ఎం.మోహన్ ఆదివారం బాధ్యతలను చేపట్టారు. ఈయన పల్నాడు జిల్లా సీసీఎస్ నుంచి పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పఠాన్ రబ్బానీ ఖాన్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

ఒప్పిచర్లలో డయేరియా కేసులు

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ రమ్య

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో డయేరియా కేసులు బయటపడుతుండడంతో గ్రామంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. క్యాంపునకు ఐదుగురు వాంతులు, విరేచనాలతో బాధపడుతూ వచ్చారు. వారిలో ముగ్గురికి పీహెచ్‌సీలోనే చికిత్స ఇవ్వడంతో తగ్గడంతో వారిని ఇంటికి పంపారు. మిగిలిన ముగ్గురిని నర్సరావుపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. 12 మంది దాకా విరేచనాలతో బాధపడుతూ పీహెచ్‌సీకి వచ్చారు. వారు కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరంలో పీహెచ్‌సీ డాక్టర్లు డాక్టర్ ఎం.రమ్య, డాక్టర్ కె.లక్ష్మీమౌనిక పీహెచ్‌సీ సిబ్బంది వైద్య సేవలందించారు. ఇదిలా ఉంటే గత వారం రోజులుగా గ్రామంలోని 20 మంది దాకా డయేరియా రోగులు నర్సరావుపేటలోని వివిధ ఆస్పత్రుల్లో చేరి చికిత్సపొందుతున్నట్లు తెలుస్తోంది. గ్రామంలోని బోర్లలో కలుషిత నీటి వల్ల సమస్య వచ్చినట్లుగా భావిస్తున్నామని ఎవరూ కలుషిత, నిల్వ ఉన్న ఆహారాన్ని తినవద్దని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, జంక్ ఫుడ్స్, ఇతర నిల్వ ఉన్న మాంసాహారం తినవద్దని డాక్టర్లు సూచిస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ నయీముల్లా



నయీముల్లాను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ సరోజిని, అధ్యాపకులు

విజయపురిసౌత్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్, నాగార్జున సాగర్ ఏపీఆర్ జేసీ పూర్వ విద్యార్థి నయీముల్లా అన్నారు. నయీముల్లా ఆదివారం స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులతో సమావేశం అయ్యారు. ముందుగా కళాశాల తరగతి గదులు, వసతి గృహాన్ని పరిశీలించారు. కళాశాల ప్రధాన ద్వారం నుంచి హాస్టల్ భవనాల వరకు ఉన్న సుమారు 250 మీటర్ల మట్టి రోడ్డును సొంత నిధులను వెచ్చించి తారు రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యాభ్యాసంతో పాటు తన జీవితంలో జరిగిన ఒడిదుడుకులను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం సీఈ నయీముల్లాను ప్రిన్సిపాల్ సరోజిని, అధ్యాపకులు సన్మానించారు. జిల్లా ఇంజినీరింగ్ ఆఫీసర్ ఆర్.రాజా నాయక్, అధ్యాపకులు లింగేశ్వరావు రత్న బాబు, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్, పూర్వ విద్యార్థి గొంతిన రమేష్ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం



మండాదిలో ధ్వజస్తంభాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో రాతి, చెక్క ధ్వజ స్తంభాల ప్రతిష్ట ఆదివారం ఉదయం 9.20గంటలకు వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి(జేబీఆర్) హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులంతా ప్రసన్నాంజనేయ స్వామి ధ్వజస్తంభాలను కలిసికట్టుగా ప్రతిష్టించటం సంతోషకరమన్నారు. వేద పండితుడు పవన్‌కుమార్ చార్యుల ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభాల ప్రతిష్టా కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా జరిగింది. మధ్యాహ్నం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి నవధాన్యాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. టీడీపీ నాయకులు కుర్రి శివారెడ్డి, పులుసు శివారెడ్డి, మండలపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపాడులో పోలేరమ్మ ఉత్సవం

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మకు ఆదివారం గ్రామస్తులు బండి కట్టి ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో పోలేరమ్మ తల్లికి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాదీ గ్రామస్తులు పోలేరమ్మకు బండి కట్టి గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పాడి పంటలు బాగా పండాలని, సిరిసంపదలు కలగాలని, వర్షాలు సకాలంలో కురవాలని, ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తుంటామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలి

నకరికల్లు: సొసైటీలో సభ్యత్వం కలిగినవారందరూ విధిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని నకరికల్లు సొసైటీ సీఈఓ కోళ్లపూడి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. నకరికల్లు సొసైటీ బ్రాంచ్ ఆధునికీకరణలో భాగంగా కంప్యూటరీకరణ చేస్తున్నట్లు చెప్పారు. సభ్యులందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్నందున ఆధార్‌కార్డు, పాస్‌కార్డు జిరాక్సులు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్‌నంబర్‌తో పనివేళల్లో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం నేరుగా కార్యాలయంలోని సిబ్బందితో సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

కళాశాల విద్యార్థినికి ఆర్థిక సాయం



ఫిరంగిపురం: కుమ్మర శాలివాహన జిల్లా సంఘం ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థికి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని అల్లంవారిపాలెం నిర్వహించిన కార్యక్రమంలో అందించారు. సంఘ సభ్యుడు కె.రాములు మాట్లాడుతూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వెంకయ్య పిలుపు మేరకు తమ సంఘంలో ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లల చదువుల నిమిత్తం సహాయం చేస్తున్నామన్నారు. మార్కాపురానికి చెందిన సీహెచ్ నీలావతి గుంటూరు రూరల్‌లోని ఆర్‌వీఆర్ కళాశాలలో బీటెక్ చదువుతుండటంతో విద్యార్థికి రూ.15 వేలు సాయం అందించినట్లు పేర్కొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ



మండల పరిషత్ ఉద్యోగులు, కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోజనీదేవి

మాచర్ల రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పెంపొందించి అంటు రోగాలను నివారించటంతో పాటు ఘనవ్యర్థ నిర్వహణపై పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ కె.సరోజనీదేవి తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో ప్రభుత్వం నిర్దేశించిన పనులను ఏ విధంగా చేయాలి, ముఖ్యంగా అభివృద్ధి ప్రణాళిక, వీధి దీపాల నిర్వాహణ, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు కార్యాలయ ఆవరణలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధి హాజరయ్యేలా కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిర్వహించే శిక్షణలో జిల్లా పంచాయతీ శాఖాధికారులు పాల్గొని పలు అంశాల పై వివరించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధిపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు

- ● గిరిజనుల అభివృద్ధికి వైఎస్ జగన్ కృషి చేశారు
- ● వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



వెల్దుర్తి: గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో కృషి చేశారని వైఎస్సార్ సీపీ ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని శ్రీరాంపురంతండాలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గిరిజనులకు మేలు చేసే ప్రతి పథకాన్ని అమలు చేసిందన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, జగనన్న బడుగు వికాసం, జగనన్న విదేశీ విద్య తదితర పేర్లతో ఆయా పథకాలు అన్నింటినీ అమలుపరిచిందన్నారు. గిరిజనులకు సంబంధించిన 16 పథకాలను గత వైఎస్సార్ సీపీ రద్దు చేసిందని సీఎం చంద్రబాబు ఆదివాసీ దినోత్సవ సభలో చెప్పటం దుర్మార్గమన్నారు.

చంద్రబాబు గతంలో 14సంవత్సరాలు సీఎంగా పనిచేసినప్పుడు ఆయన గిరిజనుల అభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంభించిన విషయం గిరిజనులు అందరికీ తెలుసునన్నారు. సీఎం హోదాలో చంద్రబాబు గిరిజనుల అభివృద్ధి కోసం ఒక్క కొత్త పథకాన్ని అయినా ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో గిరిజనుల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాల పేర్లను 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక చంద్రబాబు మార్చారని, ఆతర్వాత రద్దు చేశారన్నారు. వైఎస్ జగన్ తన మంత్రిమండలిలో గిరిజనులైన పాముల పుష్ప శ్రీవాణి, పీడిక రాజన్న దొరలకు ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం కల్పించారన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత దేశంలో వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గిరిజన సలహామండలి ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ ట్రికార్, జీసీసీ పాలక మండళ్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నియమించిన వైఎస్ జగన్ గిరినుల అభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం దేవస్థానం పాలక మండళ్లలో మొట్టమొదటి సారిగా గిరిజనులను సభ్యులుగా నియమించిన వైఎస్ జగన్ గిరిజనుల పట్ల తన చిత్తశుద్దిని చాటుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 500 జనాభా కలిగిన 165 గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీ ప్రకటించటం జరిగిందన్నారు.

అటవీ, రెవెన్యూ భూములను సాగు చేసుకుంటున్న 1,56,655 కుటుంబాలకు 3,26,982 ఎకరాల భూమిని రాష్ట్రంలోని గిరిజన లబ్ధిదారులకు వైఎస్ జగన్ పంపిణీ చేయటం జరిగిందన్నారు. గిరిజనుల అభివృద్ధి పై సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. గిరిజనులకు చేసిన మేలు ఏమిలేకపోవటంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పై దుష్ప్రచారం చేయటం మొదలుపెట్టారన్నారు. గిరిజనుల అభివృద్ధి ఎవరి హయాంలో జరిగినే విషయం పై బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైఎస్సార్ సీపీ, మాజీ సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తూ ప్రజల దృష్టి మరల్చేందుకు టీడీపీ కూటమి కుట్ర పన్నుతోందని దుయ్యబట్టారు.

పట్టణ సరిహద్దుల్లో స్వాగత ద్వారాలు



పట్టణ సరిహద్దులో జాతీయ రహదారిపై పొక్లెయిన్‌తో ఏర్పాటు చేస్తున్న ఆర్చ్

సత్తెనపల్లి: గుంటూరు–మాచర్ల జాతీయ రహదారిలో సత్తెనపల్లి వైపు వచ్చే ప్రజలకు పట్టణ పరిధి తెలిసేలా సరిహద్దుల్లో స్వాగత ఆర్చ్‌ని పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఐరన్ పోల్స్‌తో ఏర్పాటు చేసి పైన సత్తెనపల్లి పురపాలక సంఘం సుస్వాగతం అంటూ ఆర్చ్ ఏర్పాటు చేశారు. మాచర్ల వైపు నుంచి వచ్చే ప్రజలకు సత్తెనపల్లి పట్టణంలోకి ప్రవేశిస్తున్నట్లు తెలిసేలా వీటిని ఏర్పాటు చేశారు. ఆర్చ్ పనులను మున్సిపల్ ఏఈ సాగర్ ఆదివారం పర్యవేక్షించారు. ఈ ఆర్చ్ పై ఓ వైపు సీఎం చంద్రబాబు, మరో వైపు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఫొటోలను ఏర్పాటు చేశారు.

రక్తనాళాల వైద్య శిబిరం



వైద్యులను సత్కరిస్తున్న శ్రీ సత్యసాయి సేవా సమితి బాధ్యులు

సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పార్క్‌రోడ్‌లో గల శ్రీ సాయి గాయత్రి ధ్యాన మందిరంలో శ్రీ సత్యసాయి సేవా సమితి సత్తెనపల్లి, ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య శిబిరంకు విశేష్పందన లభించింది. కాళ్లలో రక్త సరఫరా సరిగ్గా లేకపోవడం, ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు ఉండడం, కాలు లేదా పాదాల్లో వాపు, షుగర్ వ్యాధి వల్ల పుండు ఉండటం, నరాలు లాగడం, తిమ్మిర్లు వాటి సమస్యలతో బాధపడే వారికి ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్సలు చేపట్టాల్సిన వారిని గుర్తించి వారికి ఆరోగ్య శ్రీ ఆయుష్మాన్ భారత్ ద్వారా ఉచితంగా లేజర్ ట్రీట్మెంట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 150 మంది వైద్యసేవలు పొందారు. వైద్యులు ప్రత్యేకంగా రక్తనాళాల సర్జన్ కన్సల్టేషన్, రూ.4,500 విలువైన వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. అనంతరం వైద్యులను సత్కరించారు. శ్రీ సత్య సాయి సేవ సమితి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఉమా మాధవ్, సమితి కన్వీనర్ కె.భాస్కరరావు, ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్స్ వైద్యులు, తదితరులు ఉన్నారు.

మిర్చి ఘాటు.. ప్రజారోగ్యానికి చేటు

గుంటూరు రూరల్: స్థానిక మిర్చి యార్డులో ఎక్స్‌పోర్ట్ చేసే సంస్థలు కొన్ని.. నగర శివారులోని నల్లపాడు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, తురకపాలెం, ఓబులు నాయుడుపాలెం, నాయుడుపేట, పొత్తూరు, లింగాయపాలెం ఖాళీ స్థలాలు, లాలుపురం పరిసరాల్లో షెడ్‌లు ఏర్పాటు చేసుకుని మిర్చి తొడేలను తీస్తుంటాయి. అనంతరం వ్యర్థాలను బస్తాల్లో తీసుకెళ్లి ఆయా గ్రామాల ప్రధాన వీధుల వెంట పడేస్తున్నారు. రాత్రిళ్లు వాటిని దహనం చేస్తుంటారు. ఈ క్రమంలో వాటి నుంచి వచ్చే కోరును ప్రయాణికులతో పాటు, సమీప గ్రామాల ప్రజలు పీల్చలేక దగ్గు బారిన పడుతున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇలాగే.. కొనసాగితే శ్వాసకోశ వ్యాధులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఊపిరి తిత్తులు దెబ్బతినే అవకాశాలు లేకపోలేదని స్థానిక వైద్యులు కూడా హెచ్చరిస్తున్నారు. మిర్చి యార్డులో మిరపకాయలు విక్రయాల అనంతరం నేలపై మిగిలిపోయి, రాలిపోయిన మిర్చి విత్తనాలు ఊడుపు పేరుతో కొందరు కొనుగోలు చేస్తారు. వాటిని నాయుడుపేట, ఓబులునాయుడుపాలెం, వెంగళాయపాలెం, పొత్తూరు, చౌడవరం గ్రామాల శివారుల్లో పెద్దపెద్ద మిషన్‌లు ఏర్పాటు చేసి తూర్పారబట్టి విత్తనాలు తయారు చేస్తుంటారు. ఈ క్రమంలో గాలికి మిర్చి ఘాటుతో కూడిన దుమ్ము తెరలు తెరలుగా రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం వారిపై నిఘా ఉంచి, ఆ విత్తనాలు ఏంచేస్తారని అధికారులు కూడా పట్టించుకోక పోవటంతో వాటిని కొందరు నూనె తీసేందుకు వాడతారని, కొందరు నకిలీ మిర్చి విత్తనాల్లో కలుపుతారని అంటున్నారు. ఒక పక్క నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయి ప్రాణాలు సైతం కోల్పోతున్న ఘటనలు ఉన్నాయి.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు



మంగళగిరి: పట్టణంలో తోపుడు బండ్లు, కూరగాయల బండ్లు ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వినోద్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని మెయిన్ బజార్, గౌతమబుద్ధా రోడ్డులో పర్యటించి తోపుడు బండ్ల, కూరగాయల వ్యాపారులు, చిరు వ్యాపారులు తమ వ్యాపారానికి వాడే బండ్లు వగైరాలను రోడ్లపై ఉంచి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుంచకుండా చూడాలన్నారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులు అధికారులు కేటాయించిన స్థలాల్లో వ్యాపారం చేసుకుని, అధికారులకు సహకరించాలని కోరారు.